# మనవే'మన పద్యాలు

**ఆ. వె. ఆపదలగు వేళ నరసిబంధుల జూడు**
**భయమువేళ జూడు బంటుతనము**
**పేదవేళ జూడు పెండ్లాము గుణమును**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**అర్థములు** : బంటుతనము = వీరత్వము, ధైర్యము;

**తాత్పర్యము** : అన్నీ సవ్యముగానున్నప్పుడు బంధువుల ప్రేమను పొందుట గొప్ప విషయమేమీ కాదు. కష్టాలు వచ్చినపుడు ఆ బంధువుల ప్రేమను పొందగలగడం భాగ్యం. కష్టసమయములలోనే బంధువుల నిజస్వరూపం బయట పడుతుంది. ఎవరి ధైర్యమైనను తెలుసుకోవాలంటే భయము కలిగినపుడే పరిక్షించాలి. సంపదలున్నప్పుడు భార్య అడుగులకు మడుగులొత్తి సేవలు చేయవచ్చు. సంపదలు కోల్పోయి పేదరికము కలిగినపుడు కూడా అదే భక్తి శ్రద్ధలతో సేవించినచో నిస్సందేహముగా ఆమె గుణవంతురాలే. అలాంటి కష్టసమయములో భర్తకు అండగా ఉండగలిగితే అది ఆమె గొప్పతనమే. కష్టకాలములో ఆమె భర్తను విడిచిపోయినయెడల ఆమె సహజగుణము బయటపడుతుంది.

**ఆ. వె. మాటలాడుటొకటి, మనసులో నొక్కటి,**
**ఒడలి గుణము వేరె, యోజవేరె**
**ఎట్లు గలుగుముక్తి యీలాగుతానుండ?**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**అర్థములు** : ఒడలి గుణము = శరీరముతో చేయు కర్మ;
యోజ = ఆలోచన;

**తాత్పర్యము**: బయటికి చెప్పేది ఒకటి. మనసులో ఆలోచన ఒకటి. చేసేది ఇంకొకటి. మహాత్ములు మనసులో ఆలోచించేది మాటలలో వ్యక్తపరచి, దానినే ఆచరించెదరు. దుర్జనులు చెప్పేదానికి, ఆలోచించేదానికి, చేసేదానికి పొంతన ఉండదు. ఇలా త్రికరణశుద్ధిలేని దుర్జనులకు మోక్షమెట్లు కలుగుతుంది? పద కవితా పితామహుడు శ్రీ తాళ్ళపాక అన్నమయ్య 'త్రికరణ శుద్ధితో చేసిన పనులను దేవుడు మెచ్చును, లోకం మెచ్చును' అని తన కీర్తనలో తేటతెల్లము చేసాడు.

*(ఇందులో కొంత భాగము స్వామి చిదాత్మానందగారి 'వేమన పద్యములు - అంతరార్థము' ప్రవచనములలో ఒంట పట్టించుకున్న సారాంశము. పూజ్య శ్రీ స్వామి చిదాత్మానంద గారికి ధన్యవాదములతో...)*

**వేమన పద్యములలోని కొన్ని సామెతలు:**
1. చెప్పు తినెడి కుక్క చెఱకు తీపెఱుగునా?
2. సాధనమున బనులు సమకూరు ధరలోన.